రోడ్లపై చెట్లకొమ్మలు..
భవన వ్యర్థాలు
తొలగించని పారిశుధ్య సిబ్బంది

- ఇబ్బంది పడుతున్న చికోటిగార్డెన్ కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు


చికోటిగార్డెన్ రహదారి పక్కన భారీగా డంప్ చేసిన భవన వ్యర్థాలు


చికోటిగార్డెన్‌లోని ఓ అపార్టుమెంట్ వద్ద డంప్ చేసిన చెట్లకొమ్మలు

బేగంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): పచ్చనిచెట్లు.. చక్కని రహదారులతో చికోటిగార్డెన్ ఆహ్లాదకరంగా ఉంటుంది. ఒకప్పుడు సినీ ప్రముఖులు నివసించిన ప్రాంతం. ఈ కాలనీలో ఏ రోడ్డుకు వెళ్లినా చెట్లు దర్శనమిస్తాయి.

ధనవంతుల కాలనీగా పేరొందిన బేగంపేటలోని చికోటిగార్డెన్ ప్రాంతంలో ప్రస్తుతం పారిశుధ్య సమస్య నెలకొంది. కాలనీ మధ్యలో ఉన్న పార్కుకు వచ్చే ప్రధాన రహదారిలో భారీగా భవన వ్యర్థాలు డంప్ చేశారు. దీనికితోడు కాలనీ చుట్టూ ఉన్న రహదారుల్లో చెట్లకు ఉన్న కొమ్మలను నరికి రోడ్ల పక్కన డంప్ చేశారు. వారం రోజులైనా వీటిని తొలగించకపోవడంతో అక్కడ పురుగు, పుత్ర చేరే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే కాలనీలోని సీనియర్ సిటిజన్లు రహదారుల్లో వాకింగ్ చేస్తుంటారు. ఈ సమయంలో పాములు కాటేసే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణ వ్యర్థాలు, చెట్లకొమ్మలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


పార్కులో చెట్టును నరికి తొలగించకుండా వదిలేసిన కొమ్మలు, చెట్టు కాండం

త్వరలో రాజీవ్‌గాంధీ క్రికెట్ టోర్నీ


సమావేశమైన సురేందర్ అగర్వాల్, ప్రవీణ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రాజీవ్ గాంధీ డిఫెరెంట్లీ ఏబుల్డ్ ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ వింగ్ సన్నాహకాలు చేస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో హైదరాబాద్ వేదికగా జాతీయ టోర్నమెంట్‌ను డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్(డీపీసీఏహెచ్) విజయవంతంగా నిర్వహించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌లో డీఏసీఏహెచ్ అధ్యక్షుడు సురేందర్ కుమార్ అగర్వాల్‌తో ఏఐపీసీ ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి సమావేశమై చర్చించారు. త్వరలో టోర్నీ వివరాలను వెల్లడించనున్నామని వారు తెలిపారు.

మానవ అక్రమ రవాణా ద్వారా
బంగ్లాదేశ్ నుంచి నగరానికి..

- మహిళా రోగికి ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స
- కోలుకున్న అనంతరం స్వదేశానికి తరలింపు

ఎర్రగడ్డ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితురాలు మానవ అక్రమ రవాణా ద్వారా నగరానికి చేరుకుందని తెలుసుకుని స్వస్థలం బంగ్లాదేశ్‌కు తరలించారు. మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ డా.అనిత రాయిరాల తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ రవాణాకు గురై, మానసిక సమస్యలతో నగరంలో తిరుగుతున్న బాధితురాలు(24)ను కూకట్‌పల్లి పోలీసులు మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 2023 జూన్‌లో మానసిక వైద్యశాలలో చేర్చారు. వైద్య నిపుణుల చికిత్సతో ఆమె కోలుకుంది. ఆస్పత్రి ప్రాంగణంలోని సయోధ్య పునరావాస కేంద్రంలో ఆమెకు ఆశ్రయం కల్పించారు. ఆమె బంగ్లాదేశ్ నుంచి అక్రమ రవాణా చేయబడిందని గుర్తించిన సయోధ్య ప్రతినిధులు చెన్నైలోని బంగ్లాదేశ్ హైకమిషన్, ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ)ని సంప్రదించారు. వారి సూచనల మేరకు బాధితురాలిని హౌరా రైల్వేస్టేషన్ నుంచి బంగ్లాదేశ్‌కు పంపేందుకు బుధవారం ఆమెను సరిహద్దుకు తరలించారు.

ఎయిర్‌గన్‌తో హల్‌చల్ చేసిన నిందితుడి అరెస్ట్

- రూ. 3.40 లక్షలు, 8 తులాల బంగారం, బైక్ స్వాధీనం

అమీర్‌పేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం ఈస్ట్ శ్రీనివాసనగర్‌లో ఎయిర్ గన్‌తో హల్‌చల్ చేసిన నిందితుడిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇతడి నుంచి ఎయిర్ పిస్టల్, రూ.3.40 లక్షల నగదు, 8 తులాల బంగారంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ విశాఖపట్నంకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ తిప్పరాజు రామకృష్ణ నెలన్నర క్రితం విశాఖ మధురానగర్ ద్వారకలోని ఓ ఇంట్లో చోరీ చేశాడు. ఆ బంగారాన్ని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లో నివాసం ఉంటున్న సోదరి భాగ్యమ్మ, అల్లుడు అశోక్‌కు ఇచ్చాడు. ఈ బంగారాన్ని విక్రయించిన అశోక్ తన ప్రియురాలితో ఎంజాయి చేసేందుకు ఎస్ఆర్‌నగర్‌కు వచ్చాడు. ఈస్ట్ శ్రీనివాసనగర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు ద్విచక్ర వాహనంపై వచ్చిన అశోక్‌ను ఆపి వివరాలు అడిగారు. దీంతో పొంతన లేని సమాధానం చెప్పడంతో అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. ఇందులో రూ.3.40 లక్షల నగదు, ఎయిర్ పిస్టల్, 8 తులాల బంగారం లభించింది. వెంటనే అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన రీతిలో విచారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి


దీపక్(ఫైల్)

హైటెక్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందాడు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరకాల మండలం పులిగిల్ గ్రామానికి చెందిన ముత్యంరావు కుమారుడు మోకిడి దీపక్(29) ఓఆర్ఆర్ సమీపంలోని మల్లంపేటలో ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మల్లంపేటలోని ఇంటి నుంచి బయటకు వచ్చిన దీపక్ అల్విన్ కాలనీ, తులసినగర్‌లోని సోదరుడు మణికంఠ ఇంటికి వెళ్లాడు. రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్నాడు. అనంతరం అక్కడ నుంచి వచ్చేసిన ఆయన అర్ధరాత్రి 2.10 గంటల సమయంలో బోరబండ సమీపంలోని పర్వత్ నగర్ నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లేందుకు హీరో గ్లామర్(టీఎస్ 03 ఈఈ 2377)పై వెళ్తున్నాడు. అదే సమయంలో బిర్యానీ టైమ్స్ హోటల్ వద్ద వాటర్ ట్యాంకర్(టీఎస్ 12 యూఏ 9090) డ్రైవర్ అకస్మాతుగా యూటర్న్ తీసుకున్నాడు. దీపక్ వాహనం అదుపు తప్పడంతో లారీ చక్రాల కింద పడిపోయాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీపక్ బావ కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బలరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అపార్టుమెంట్ సెక్రటరీపై కేసు నమోదు

అమీర్‌పేట, మే 7 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వారిపై దురుసుగా ప్రవర్తించి, వాచ్‌మన్‌ను దుర్భాషలాడిన కేసులో జక్‌కాలనీ ఎస్‌వీహిల్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సెక్రెటరీపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న సాయంత్రం అపార్ట్‌మెంట్‌లో గట్టిగా శబ్దం వినిపించింది. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న అనురాధ వెళ్లి చూడగా లిఫ్ట్ ఆగిపోయింది. ఇందులో ఉమాదేవి, వంశీకృష్ణ, సంగీత, రూపా చిక్కుకున్నారు. వెంటనే విషయాన్ని రూపా భర్త రాజశేఖర్‌రెడ్డికి చెప్పింది. రాజశేఖర్‌రెడ్డి అపార్ట్‌మెంట్ సెక్రెటరీ ఆదిత్యకు ఫోన్ చేసి చెప్పినా, ఆయన స్పందించలేదు. చేసేదేమీ లేక అనురాధ డబ్బులు ఇచ్చి డీజిల్ తెమ్మని వాచ్‌మన్‌ను పంపిస్తుండగా, సెక్రెటరీ అడ్డుకున్నాడు. వాచ్‌మన్‌ను దుర్భాషలాడాడు. ఇంతలో కరెంట్ రాగా లిఫ్ట్‌లో ఉన్న వారు సురక్షితంగా కిందకు వచ్చారు. జరిగిన విషయాన్ని తెలుసుకున్న అపార్ట్‌మెంట్‌వాసులు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదిత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై రాడ్డుతో దాడి

బంజారాహిల్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): భర్త పై భార్య రాడ్డుతో దాడి చేసింది. నేపాల్‌కు చెందిన కృష్ణ దామత్ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.45లో ఫోర్టిట్రీవ్ హౌస్ పబ్‌లో హౌస్‌కీపింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. భార్య సునీత, ఇద్దరు పిల్లలతో అక్కడే ఉంటున్నాడు. 2024లో ఇంట్లో అవసరాల నిమిత్తం కృష్ణ తన స్నేహితుడి వద్ద రూ.1.5 లక్షలు తీసుకున్నాడు. మరుసటి రోజు మద్యం మత్తులో గదికి వెళ్లగా సునీత డబ్బులు ఎందుకు తీసుకున్నావంటూ గొడవపడింది. భర్త, పిల్లలను వదిలేసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 నందినగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఉంటుంది. అప్పటి నుంచి ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఇటీవల కృష్ణ దామత్ బావమరిది దిలీప్ ఫోన్ చేసి సునీత మరొకరిని వివాహం చేసుకుంటుందని చెప్పాడు. దీంతో కృష్ణ ఈనెల 6న సునీత వద్దకు వెళ్లాడు. వివాహం గురించి అడిగాడు. సునీత అతడిని రాడ్డుతో కొట్టగా, కుడి కన్నుకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంగీత విభావరి టికెట్ పేరిట మోసం

బంజారాహిల్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): సంగీత విభావరి టికెట్ పేరిట సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12కు చెందిన రణబీర్ సింగ్ బగ్గా ఈనెల 4వ తేదీన హెచ్ఐసీసీలో జరిగిన రిషబ్ రికిరాం శర్మ సితార కార్యక్రమానికి వెళ్లేందుకు టికెట్ కోసం ఈనెల 3న ఇంటర్నెట్‌లో వెతుకుతున్నాడు. అందులో లభించిన నెంబర్‌కు వాట్సాప్‌కు మెసేజ్ చేయగా రూ.10,500 టికెట్ ఖరీదని అవతలి వ్యక్తి చెప్పాడు. ఈ మేరకు రణబీర్ డబ్బులు పంపించాడు. మరుసటి రోజు టికెట్ వాట్సాప్ వస్తుందని చెప్పారు. కానీ టికెట్ రాలేదు. డబ్బులు పంపించిన ఫోన్ నెంబర్ పనిచేయలేదు. మోసపోయినట్టు గ్రహించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన నిర్ణయంపై 96 బీసీ సంఘాల హర్షం

ఖైరతాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): కులగణనపై పలు సూచనలతో కూడిన నివేదికను ప్రధాని మోదీకి సమర్పించేందుకు బీసీ సంఘాల ప్రతినిధుల బృందం ఢిల్లీ వెళ్లాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. బుధవారం లక్డీకాపూల్‌లోని అశోక హోటల్‌లో బీసీల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో 96 బీసీ సంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాజికవేత్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో కుల గణన నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై వివరణ ఇవ్వాలని కోరారు. 1948 జనగణన చట్టంలో సవరణలు చేసి కులగణనకు చట్టపరమైన ఆధారాన్ని కల్పించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో బొమ్మ రఘురాం నేత, మున్నూరుకాపు అధ్యక్షుడు దేవన్న, పలు కుల సంఘాల ప్రతినిధులు వెన్న ఈశ్వరప్ప, రాములన్న, రామకృష్ణ, నర్సింహయాదవ్, కుమారస్వామి, అనురాధగౌడ్, రమాదేవి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (2025-27) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డా.పి.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కె.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మియాజాని, ప్రధాన కార్యదర్శిగా పి.విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా వై.అశోక్, కోశాధికారిగా బి.పాండు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రిటర్నింగ్ ఆఫీసర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డిలకు పరిచయం చేశారు.

టెక్నికల్ ఆఫీసర్స్ స్టాఫ్ అసోసియేషన్..

డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ టెక్నికల్ ఆఫీసర్స్ స్టాఫ్ అసోసియేషన్(2025-27) కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా బి.ఎస్.ఆర్.భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డి.వసంతరావు, ప్రధానకార్యదర్శిగా డా.యాకేశ్ దైదా, సంయుక్త కార్యదర్శిగా ఈ.శ్రీహరి, కోశాధికారిగా బి.ధర్మకళ్యాణ్ ఎన్నికయ్యారు. వీరంతా వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డిలను కలిశారు.

చర్లపల్లి-బెర్హంపూర్ మార్గంలో 16 వేసవి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని పురస్కరించుకొని చర్లపల్లి-బెర్హంపూర్ మార్గంలో 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈ నెల 9నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15గంటలకు చర్లపల్లి నుంచి బెర్హంపూర్‌కు (07027) ప్రత్యేక రైలు, ఈ నెల 10నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం బెర్హంపూర్ నుంచి చర్లపల్లికి (07028)ప్రత్యేక రైలు బయల్దేరుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. మార్గమధ్యంలో (ఇరువైపులా) ఈ ప్రత్యేకరైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు.

ఖైరతాబాద్‌లో అభివృద్ధి పనుల పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ మైదానంలో రూ.18 లక్షలతో స్పోర్ట్స్ గది, టాయిలెట్ల పనులు, న్యూ సీఐబీ క్వార్టర్స్ శ్రీనివాసనగర్ రహదారిలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. వీటిని స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి డీఈ చైతన్యతో కలిసి బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులు మహేందర్ బాబు, మహేష్ యాదవ్ కూడ రోడ్డు పనులను పరిశీలించడం గమనార్హం.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జన్మదినం


కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్యులు

బంజారాహిల్స్/బోరబండ, మే 7 (ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు ఎల్లారెడ్డిగూడలో ఘనంగా జరిగాయి. స్థానిక హనుమాన్ ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చన, పల్లకిసేవ వంటి పూజాదికాలతోపాటు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ కూర బద్రీనాథ్, వనిత చార్టర్ ప్రెసిడెంట్ జయదుర్గ, వనిత క్లబ్ అధ్యక్షులు మంచికంటి వాణిశ్రీ, కమిటీ సభ్యులు ఆకుల నారాయణ, మంచుకొండ నర్సింహ, వేముల నారాయణరావు, ఆర్యవైశ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు. రహ్మత్‌నగర్‌లోని సంతోష్‌గిరి సంతోషిమాత ఆలయ ప్రాంగణంలోని వాసవిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిటుమల్లి శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యక్షుడు వరగంటి శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి డి.మధుసూదన్‌గుప్తా, వి.రాజేష్ కుమార్‌గుప్తా, నాగరాజు, కోఫూరి ప్రభు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు కాంగ్రెస్‌కు స్ఫూర్తి

- రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్



జైబాపు, జై భీం, జై సంవిధాన్ పేరిట నిర్వహించిన ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఏఐసీసీ సభ్యుడు అజారుద్దీన్, కార్పొరేటర్లు

బంజారాహిల్స్/బేగంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుంటూ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. రాజ్యాంగాన్ని తూచ తప్పకుండా అన్నివర్గాలను కలుపుకుంటూ దేశ సార్వభౌమత్వాన్ని నిరంతరం పార్టీ కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పిలుపు మేరకు 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' నినాదంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్ నుంచి పీజేఆర్ కమ్యూనిటీహాల్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు.


ర్యాలీలో కోట నీలిమ తదితరులు

అనంతరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకుడు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ఏఐసీసీ సభ్యుడు అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ లాంటి వారు పోరాటం చేస్తే, అందరికీ సమాన హక్కులు కల్పించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ చరిత్రను భావితరాలకు తెలియసేలా కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. అజారుద్దీన్ మాట్లాడుతూ కార్యకర్తలు ఒక తాటి మీదకు వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, బాబాఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు సదేశ్వర్, సీనియర్ నాయకులు నవీన్‌యాదవ్, భవానీశంకర్, మనోజ్ యాదవ్, కిరణ్‌యాదవ్, టీపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ మహ్మద్ అసద్ పాల్గొన్నారు.

బేగంపేటలో నిర్వహించిన ర్యాలీలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ, విశాల్ సుదాం, సలీంఖాన్, అభిషేక్, జగదీష్ పాల్గొన్నారు.

భారత జవాన్లకు మద్దతుగా మేమున్నాం

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగరావు, రమేష్, రాజు తదితరులు

బంజారాహిల్స్/మాదాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు మద్దతుగా మేమున్నామంటూ ఫిలింనగర్‌లోని ఏబీఎన్ ఛానెల్ నుంచి అపోలో చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు మాట్లాడుతూ పహల్గాంపై దాడి చేసి ఉగ్రవాదులు అన్యాయంగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు. ఎన్నో కుటుంబాలకు ఆవేదన మిగిల్చారని తెలిపారు. ఈ తరుణంలో ఉగ్రవాదాన్ని ఉసిగొల్పే పాకిస్థాన్‌కు గట్టిగా బదులు ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పహల్గాం దాడికి ప్రతీకగా భారత్ సర్కార్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఉగ్రవాదుల గుండెల్లో భయం పుట్టించిందన్నారు. భారత సైనికులకు ప్రతీ పౌరుడు మద్దతుగా నిలవాలని సూచించారు. యుద్ధం జరిగితే ప్రజలు తమకు తాము రక్షించుకుంటూ ఇతరులకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, ఆకుల రాజు, అబ్దుల్ ఘని, సంపంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మాదాపూర్‌లోని సైబర్ టవర్, అయ్యప్ప సొసైటీ, ఇనార్బిట్ మాల్, ముందే స్పేస్ కూడళ్ల వద్ద సైరన్‌ను ఏర్పాటు చేసి పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఏదైనా విపత్కర పరిస్థితుల్లో సైరన్ మోగగానే చెవులు మూసుకొని తలకిందకు దించుకొని చుట్టుపక్కల ఉన్న సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ సూచించారు.

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌స్వామి

పంజాగుట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి బలం అని, పనిచేసే నాయకులు, కార్యకర్తలను ఎప్పుడూ ప్రోత్సహిస్తామని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సీపీ వేణుగోపాల్‌స్వామి అన్నారు. మాజీ కార్పొరేటర్ బి.రాజు యాదవ్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడలోని మెర్క్యూర్ హోటల్‌లో హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పోలింగ్ బూత్ కమిటీ కార్యదర్శుల సమావేశం జరిగింది. బూత్ కమిటీ కార్యదర్శి, సభ్యులు తమ బూత్‌లలో నెలకొన్న సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న, చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కొందరు పార్టీలు మారి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే పార్టీని తిడుతున్నారని మాజీ కార్పొరేటర్ బి.రాజు యాదవ్ ఆరోపించారు. పార్టీ కోసం పనిచేస్తుంది కార్యకర్తలేనని, వారి సేవలను ఇటీవల పార్టీలో చేరిన వారు గుర్తించడం లేదని అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన పార్టీ నాయకురాలు మెహతా మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేష్, డివిజన్ బూత్ కమిటీ నాయకులు అఫ్సర్, రాజ్ కుమార్, శ్రీనాథ్, యూసుఫ్, కళ్యాణ్, నాసిర్, యాసీన్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చింతల


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సాగర్‌సొసైటీలోని బీజేపీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ డివిజన్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలపడిందని, మరింత బలోపేతం చేసేందుకు బూత్ స్థాయి కమిటీలను నియమిస్తున్నట్టు చెప్పారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రతీ బూత్‌కు 12 మందితో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. వీరంతా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవడమే కాకుండా సోషల్‌మీడియాలో గ్రూపులు ఏర్పాటు చేసి ప్రతీ నిత్యం పలకరించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, కౌన్సిల్ సభ్యులు కాడిగారి బోజిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకట్, డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, నాయకులు కొత్త నీరజ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మారేడుపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ కోరారు. బుధవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద మంజూరైన రూ.36 లక్షల నాలుగువేల 176ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందిస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు ఐదేళ్ల పాటు అధికారం ఇచ్చారని రానున్న కాలంలో ఇతర పథకాలను కూడా అమలు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ పి.శ్రీకాంత్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మారేడుపల్లి, మే7(ఆంధ్రజ్యోతి): పిల్లలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మారేడుపల్లి శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని చేరడానికి విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమాజంలోని మంచి అలవాట్లు, నడవడిక గురించి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం కృష్ణ, డీన్ పద్మశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్, స్కూల్ ప్రిన్సిపాల్ రమ్య, ఆర్ఐ హరికృష్ణ, ఉపాధ్యాయులు, లెక్చరర్స్ పాల్గొన్నారు.



బోయినపల్లి హిందూ శ్మశాన వాటికను పరిశీలించిన వివిధ పార్టీల నాయకులు

శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తాం

బోయినపల్లి, మే7(ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలోని అంజయ్య మెమోరియల్ హిందూ శ్మశాన వాటికను బుధవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు, సీనియర్ నాయకులు పరిశీలించారు. ఇక్కడి మౌలిక వసతుల కల్పనకు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, సదాకేశవరెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, పాండు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, శాంసన్‌రాజు, బీజేపీ నాయకుడు బీఎన్.శ్రీనివాస్, కమిటీ అధ్యక్షులు కొండల్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ సదానంద, ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నూతన కమిటీ ఎన్నిక

అడ్డగుట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి) : నార్త్ లాలాగూడలోని శేషాపహాడ్‌లో గల సత్యహరిశ్చంద్ర హిందూ శ్మశాన వాటిక నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, లక్ష్మీనారాయణ, పరమేశ్, సుధాకర్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, కార్యదర్శి జగదీశ్వర్, సంయుక్త కార్యదర్శిగా శంకర్, బాలరాజు, కోశాధికారి దేవానంద్, కార్యదర్శులు ప్రవీణ్, రాం, తిరుపతి, ఆంథోనీ, సంతోష్, హన్మంత్, శివ, పోచయ్య, దేవయ్యలు ఎన్నికయ్యారు.

క్రైమ్ సమాచారం

యువతిని చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట , మే 7 (ఆంధ్రజ్యోతి) : చార్మినార్ చూద్దామని విజయవాడకు చెందిన ఓ యువతి ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా నగరానికి చేరుకోవడంతో నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి ప్రభుత్వ షెల్టర్‌కు పంపించారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో చార్మినార్ చూద్దామని మంగళవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. నాంపల్లి నుంచి చార్మినార్‌కు ఎలా వెళ్లాలో తెలియక ఒంటరిగా కూర్చుంది. ఈ క్రమంలో ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు బాలికను చేరదీసి ప్రభుత్వ హోంకు తరలించామని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడు. ఈ సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి బుధవారం చనిపోయి ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న విదేశీ మహిళ అరెస్టు

బోయినపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : విదేశీ మహిళ వీసా గడువు ముగిసినా నగరంలోనే ఉంటూ గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉగాండ దేశానికి చెందిన ఓ మహిళను బోయినపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతిరాజు, ఎస్సై నాగేంద్రబాబులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉగాండ దేశంలోని కకుమిరో ప్రాంతానికి చెందిన ఎంబాబాజీ షారోన్(23) టూరిస్టు వీసాపై గత ఫిబ్రవరి లో ముంబాయికి వచ్చింది. జనవరి 27తో వీసా గడువు ముగిసింది. ఈ క్రమంలో ముంబై నుంచి నగరానికి వచ్చి తాడ్‌బండ్‌లోని ఓ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నది. కాగా ఆ యువతి ఉగాండకు చెందిన అమ్మాయిల ఫొటోలను గ్రిండర్ యాప్‌లో పెట్టి విటులను ఆకర్షించి, మరో మహిళతో కలిసి వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు బుధవారం వ్యభిచారగృహంపై దాడులు చేసి ఎంబాబాజీ, ఉగాండకు చెందిన ఓ అమ్మాయితో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో యువతిని రిస్క్యూ హోంకు తరలించగా, విటులను అరెస్టు చేశారు. కాగా వీసా గడువు ముగిసిపోయిందని గుర్తించిన పోలీసులు ఈ విషయాన్ని పాస్‌పోర్టు అధికారులకు సమాచారం అందించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రజల అప్రమత్తతకే మాక్ డ్రిల్

బోయినపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ఆదేశాలతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచన మేరకు ప్రజల్లో అప్రమత్తత కలిగించే సన్నాహక చర్యల్లో భాగంగా మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ప్రజలకు సూచించారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు బోయినపల్లి ప్రాంతంలో సైరన్ల మోత మోగడంతో బోయినపల్లి చౌరస్తాలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ క్రమంలో ఎక్కడి వాహనాలను అక్కడ ఆపివేశారు. యుద్ధ, అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ దీనిపై ఎవరూ భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ యుద్ధ వాతావరణ నెలకొనే ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వ శాఖలు ఏవిధంగా భాగస్వామ్యమవుతాయో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. తప్పుడు వార్తలు, సోషల్ మీడియాల్లో వచ్చే పుకార్లు నమ్మవద్దని ప్రజల్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐలు నాగేంద్రబాబు, గిరిధర్, పీఎస్ఐ రాజు, మణిమాల, ఏఎస్ఐలు శంకర్, లతీఫ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుపల్లిలో..

పహాల్గాంలో పాక్ టెర్రరిస్టులు జరిపిన కాల్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో భాగంగా ఒకవేళ దేశంలో శత్రుదేశ టెర్రరిస్టులు యుద్ధం చేస్తే ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో తెలియజేసేందుకు నగర పోలీసులు బుధవారం సికింద్రాబాద్ మారేడుపల్లి ఏరియాలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మారేడుపల్లి షెనాయ్ నర్సింగ్ ఎదురుగా మున్సిపల్ మైదానంలో ఎదురుగా మనుబం మిలీనియం అపార్ట్‌మెంట్‌లో మాక్ డ్రిల్ జరిగింది. మాక్‌డ్రిల్‌లో కంటోన్మెంట్ నార్త్‌జోన్ పోలీసులు డీఆర్ఎఫ్, ఆర్మీ, అగ్నిమాపక ఎన్‌సీసీలతో పాటు అగ్నిమాపక బృందాలు పాల్గొన్నాయి. అపార్ట్‌మెంట్‌లో ఉన్న క్షతగాత్రులను రక్షించే విధంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్, నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజుతో పాటు అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, మారేడుపల్లి సీఐ ఎన్.వెంకటేశం, ట్రాఫిక్ సీఐ భాస్కర్, జీహెచ్ఎంసీ అధికారులు, డాక్టర్ విశాల్, సికింద్రాబాద్ డివిజన్లకు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు.



బోయిన పల్లి పోలీస్ స్టేషన్ వద్ద మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు

సాయం అందిస్తాం



అనుకోకుండా విపత్తులు జరిగినప్పుడు స్వయంగా సంఘటన స్థలానికి వెళతాం. అక్కడ క్షతగాత్రులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తాం. వారి పూర్తి వివరాలు సేకరించి తగిన విధంగా సాయం అందిస్తాం. పంచనామా కూడా నిర్వహిస్తాం.

- భీమయ్య గౌడ్ - మారేడుపల్లి తహసీల్దార్

వెంటనే స్పందిస్తాం



కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఏ చిన్న ఘటనలు జరిగినా స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటాం. ఈ మాక్‌డ్రిల్ ద్వారా ప్రజల్లో అవగాహన కలుగుతుంది. బోర్డు కార్యాలయంలోని అన్ని విభాగాల శాఖలు భాగస్వామ్యంతో విధులు నిర్వహిస్తాం.

- మహేందర్, కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ సూపరింటెండెంట్

ఉగ్రవాదానికి అంతం పలికారు



దాడి జరిగిన 11 రోజుల తర్వాత ఉగ్రవాదులకు భారత ప్రభుత్వం ఘాటైన సమాధానం చెప్పింది. పాక్ టెర్రరిస్టులను అంతమొందించడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తుంది. ఏదైనా శత్రుదేశం నుంచి ప్రమాదం ఏర్పడితే ఇలాంటి మాక్‌డ్రిల్ ప్రజల్లో అవగాహన ఉంటుంది.

- సంజీవ్ - ఎన్‌సీసీ జాతీయ క్యాడెట్ కోర్

చిన్నారికి చికిత్స అందిస్తున్న వైద్యులు



మారేడుపల్లిలో మనుబం మిలీనియం అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో గాయపడిన చిన్నారికి వెంటనే వైద్యం అందించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించడం, మాక్‌డ్రిల్‌లో పోలీసులు రక్షించడం లాంటి గందరగోళ పరిస్థితుల కారణంగా అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళనకు గురయ్యారు.

పాక్, బంగ్లా దేశీయులను బహిష్కరించాలి : భరత్‌గౌడ్

సికింద్రాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న పాక్, బంగ్లాదేశ్ జాతీయులను తక్షణమే బహిష్కరించాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కమిటీ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కోరింది. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్, బంగ్లా దేశీయులను బహిష్కరించటానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రదాడి చర్యపై దేశ ప్రజలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో పలు దేశాలు భారత్‌కు మద్దతుగా నిలిచాయని, ఉగ్రవాదాన్ని ప్రోత్సాహించే సంస్థలు, దేశాలపై చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రి సంకల్పించారన్నారని భరత్‌గౌడ్ తెలిపారు. ఆపరేషన్ సింధూర్ కశ్మీర్ ఆక్రమిత ప్రాంతంలో పాక్ ఉగ్రవాదులను మట్టికరిపించిన భారత్ సైనికులకు సెల్యూట్ చేసి, ప్యాట్నీ సెంటర్‌లో పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర శ్రీకాంత్, కేతినేని సరళ, సుప్రియ నవీన్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, మాజీ మేయర్ కార్తీకరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శివాజీ, పూసరాజు, కృష్ణమూర్తి, హరి, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా పహల్గాం ఉగ్రదాడికి సమాధానమే ఆపరేషన్ సింధూర్‌ని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ అన్నారు.



న్యాయసేతు మెడిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ సెషన్ హైదరాబాద్ న్యాయమూర్తి పంచాక్షరి తదితరులు

రాజీమార్గం, రాజమార్గంలో సమస్యల పరిష్కారం

బోయినపల్లి, మే7(ఆంధ్రజ్యోతి): రాజీమార్గం, రాజమార్గంలో కోర్టులకు వెళ్లకుండా అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని సీనియర్ సెషన్ జిల్లా న్యాయమూర్తి పంచాక్షరి అన్నారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెడిటేషన్ సభ్యురాలు వాసా వీణాగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యాయసేతు మెడిటేషన్ సెంటర్‌ను ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు హైదరాబాద్ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎం.శ్యామాశ్రీతో కలిసి పంచాక్షరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సెంటర్ల ద్వారా రాజీమార్గం, రాజమార్గం అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కోర్టులకు వెళ్లకుండా, పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కకుండా విపక్షాలను పిలిపించి రాజీ చేయటమే లక్ష్యంగా ఈ సెంటర్లు పనిచేస్తాయన్నారు. మొదటి సెంటర్‌ను సికింద్రాబాద్ బోయినపల్లిలో ఏర్పాటు చేసిన నిర్వాహకురాలు వాసా వీణాగౌడ్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ టి.రాజు బోయినపల్లి ఎస్సై బి.బలరాం, అడ్వకేట్ నిరంజన్, స్థానికులు బండి శ్రీనివాస్, రామారావు పాల్గొన్నారు

కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్

రాంగోపాల్‌పేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలని ఏపీ సీఎంకి లేఖ రాస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 5Iవ వర్ధంతి కార్యక్రమాన్ని నెక్లెస్ రోడ్డులోని పీవీ మార్గ్‌లో గల సంజీవయ్య పార్క్‌లోని సంజీవయ్య సమాధి వద్ద నిర్వహించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ క్రమశిక్షణ గల నాయకుడిగా దామోదరం సంజీవయ్య మానందరికీ ఆదర్శమన్నారు. టీజీ సీఎం ద్వారా లేఖ రాసి కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ అయన యువతకు ఆదర్శమని, మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, కైలాష్ లక్‌పతి గౌడ్, గరుగంటి రమేష్, నాగభూషణం, శంభుల శ్రీకాంత్ గౌడ్, ఆది అవినాష్, ఎస్సీ సెల్ రమేష్, మహేష్ రాజ్, కేశవ్, మురళికృష్ణ, ధనరాజ్ యాదవ్, శ్రీకాంత్, వికాస్ డల్లు శివ, లక్ష్మణ్, శ్రీకాంత్ అనిల్ పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య సమాధికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ హన్మంతరావు



విజయోత్సవ ర్యాలీ

పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావటంతో బుధవారం సాయంత్రం బీజేపీ ప్రధాన కార్యదర్శి జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిక్‌విలేజ్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తదితరులు.

- (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)



బోయినపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం రథ నిర్మాణం కోసం ఏర్పాట్లు పూజ చేస్తున్న దాత సుమంత్ రెడ్డి, జంపన ప్రతాప్

ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

బోయినపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పిలుపునిచ్చారు. బోయినపల్లిలో తిరుమల తిరుపతి దేవాలయంగా విరజిల్లుతున్న న్యూ సిటీకాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రముఖ వ్యాపారవేత్త సుమంత్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.10 లక్షలతో పనులు బుధవారం ఆలయ ప్రాంగణ సమీపంలో ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రథాన్ని భద్రపరచడానికి షెడ్డును నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి దాత సుమంత్‌రెడ్డి, జంపన ప్రతాప్‌లు పాల్గొని శాస్త్రోక్తంగా భూమి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, లక్ష్మణ్, రామ్ మోహన్ రావు, ఆలయ అర్చకులు పవన్ స్వామి, దీపక్ స్వామి, శ్రీధర్ స్వామి పాల్గొన్నారు.

చర్లపల్లి-బెర్హంపూర్ మార్గంలో 16 వేసవి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని పురస్కరించుకొని చర్లపల్లి- బెర్హంపూర్ మార్గంలో 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈ నెల 9నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15గంటలకు చర్లపల్లి నుంచి బెర్హంపూర్‌కు (07027) ప్రత్యేక రైలు, ఈ నెల 10నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం బెర్హంపూర్ నుంచి చర్లపల్లికి (07028)ప్రత్యేక రైలు బయల్దేరుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. మార్గమధ్యంలో (ఇరువైపులా) ఈ ప్రత్యేకరైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధల నడుమ బ్రహ్మంగారి ఆరాధనోత్సవం



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మాన్ని కాపాడుతూ ప్రతి సంవత్సరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న విశ్వకర్మ సంఘం సభ్యులు అభినందనీయులని, బ్రహ్మంగారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుతున్నట్లు రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర తెలిపారు. వీర బ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన మహోత్సవం బుధవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘం భవనంలో నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు సంఘ అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారి, ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి, కోశాధికారి బోనాల శ్రీనివాస్‌చారి, బౌరంపేట వీరాచారి, జగదీష్, సంపత్ రాజ్, సిరికొండ చందు చారి ఇతర కార్యవర్గ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బాక కిషన్ రావు, నాయకులు మదన్ మోహన్ చారిలతో పాటు పెద్ద ఎత్తున విశ్వకర్మీయులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్‌లో..

వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 332వ ఆరాధన మహోత్సవం సందర్భంగా జనరల్ బజార్‌లో మోటుకూరి సంతోష్ కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి పాల్గొన్నారు. కార్యక్రమంలో సురేష్, నరేష్ కుమార్, రాజు, సాయి కిరణ్, శ్రీనివాస్, లక్ష్మణ్, బంటి, శివ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తార్నాకలో..

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను బుధవారం లాలాపేట్‌లోని జై సంతోషిమాత దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు బండ చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జలాల్పురం శివానంద్ చారి, గౌరీ శంకర్, ఓంకార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్, మే 7(ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవిమాత అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆవులమందలో గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు చందా బాలేందర్, ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి మనుసాని శరత్ బాబు, సోమ ఆనంద్‌లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అతెల్లి అరుణ, మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, చంద్ర ప్రకాష్, తాండ్ర రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ ఆవులమందలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

● శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ జయంతి సందర్భంగా రాణీగంజ్‌లో సికింద్రాబాద్ రాణీగంజ్ వైశ్య వ్యాపారస్తుల అధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. బాల శంకర్, నేతి సంజీవ్, సోమ జయ కృష్ణ, కట్టా శ్రీనివాస్ గుప్తా, ముస్త్యాల కమలాకర్, రాజు, నవీన్, సంతోష్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తుకారాంగేట్‌లో..

నల్లపోచమ్మ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశలు ఎత్తుకుని పలు ప్రాంతాల్లో ఊరేగింపుగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కందుకూరి గణేశ్‌రావు, ఎల్లంకి వీరేశం, నాగమల్లి సుధాకర్, అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి మల్లోవోలు శ్రీకాంత్, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న తలసాని

బౌద్ధనగర్‌లో..

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం బౌద్ధనగర్‌లో ఘనంగా జరిగాయి. బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.